

కల్తీ మద్యం అమ్మితే కఠిన చర్యలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్11: మద్యంషాపుల్లో కల్తీ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని మన ప్రాంతంలో రానివ్వకుండా గట్టి నిఘాఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి మద్యం తీసుకువచ్చి ఎక్సైజ్ పరిధిలో విక్రయిస్తున్న, కల్తీ మద్యం అమ్మినట్టు తెలిస్తే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా 21కేసులు నమోదైనట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

» జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్
» ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
» శుభాకాంక్షలు తెలిపిన పలు పార్టీల నేతలు
» సందడిగా మారిన ఈద్గాలు

ఘనంగా రంజాన్







ఖిల్లా ఈద్గా వద్ద ప్రార్థనల కోసం వస్తున్న ముస్లింలు



జిల్లావ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరంలోని ఖిల్లా ఈద్గా, గాంధీచౌక్ కచియన్ మసీద్, బోధన్ రోడ్‌లోని పాత ఈద్గా, ధర్మపురి హిల్స్‌లోని మదీనా ఈద్గా, అహిలి అదీస్ ఈద్గాల వద్ద ఉదయం నుంచి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు వివిధ ప్రాంతాల్లో ముస్లిం సోదరులు ప్రార్థన మందిరాల్లో ప్రార్థనలు చేశారు. ఖిల్లా ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు నిజామాబాద్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తలు ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. • నిజామాబాద్, అర్బన్



ఖిల్లా ఈద్గా ప్రార్థనలు చేస్తూ..



శుభాకాంక్షలు తెలుపుతున్న బాజిరెడ్డి గోవర్ధన్



నగరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న తాహెర్‌బిన్ హందాన్



బోధన్‌లోని ఓ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఈద్ ముబారక్ తెలియజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మహనీయుడు జ్యోతిబాపూలే



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జ్యోతిబాఫూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతిని పురస్కరించుకొని గురువారం నగరంలోని వినాయక్‌నగర్, అంబేద్కర్ కాలనీ వద్ద గల ఆయన విగ్రహానికి పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమీకృత జిల్లాకార్యాలయం సముదాయంలోని కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో జ్యోతిబాఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత నాయకులు నరేందర్ గౌడ్, సంతోష్, ఆకుల సుజాత, తదితరులున్నారు. వీరితోపాటు బీసీ సంక్షేమ సంఘం నాయకులు నివాళులు అర్పించారు.

వర్ష భయం..!

కళ్లాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తుఫాను ప్రభావంతో గత మూడు ఈదురుగాలులతో జల్లులు కురువడంతో ఎక్కడ భారీ వర్షం కురుస్తుందోనని అన్నదాతలు భయం భయంగా గడుపుతున్నారు. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలపై టార్పలిన్లు కప్పి కంటికి రెప్పలా కాపడుకుంటున్నారు.
• డొంకేశ్వర్



దత్తాపూర్‌లో ధాన్యం కుప్పలపై టార్పలిన్లు కప్పిన రైతులు

పార్లమెంట్ ఎన్నికలపై ఏజెన్సీల నిఘా





• గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలో సర్వేలు
• ఓటర్ల నాడిని పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్న ఏజెన్సీ బృందాలు
• ఎప్పటికప్పుడు నివేదికలను ఏజెన్సీలకు పంపిస్తున్న సభ్యులు
• వారి నివేదిక ఆధారంగా ప్రచారంలో మార్పులు చేర్పులు చేసుకుంటున్న ఆయా పార్టీల అభ్యర్థులు

నిజామాబాద్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలకు చెందిన వారు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను సేకరిస్తున్నారు. ఎవరు ఏవైపు మొగ్గు చూపుతున్నారో పరిశీలిస్తున్నారు. ఓటరు నాడిని పట్టుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ ప్రధాన సమస్యలను గుర్తిస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల బల బలాలను పరిశీలించడంతో పాటు ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఏ వర్గాల నుంచి ఆ అభ్యర్థులకు అనుకూలంగా ఉందో ఎవరి నుంచి వ్యతిరేకంగా ఉందో వివరాలను తీసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో నివేదికలను పంపిస్తున్నారు. ఆ నివేదికల ఆధారంగా అభ్యర్థులను అప్రమత్తం చేయడంతో పాటు ఆయా వర్గాలను ఆకట్టుకునే విధంగా ప్రచారాలను మార్చుకుంటూ ముందుకు వెళ్లే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు.

• మెజార్టీ స్థానాల కోసం ప్రయత్నాలు

ఈ పార్లమెంట్ ఎన్నికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలకంగా మారాయి. కాంగ్రెస్, బీజేపీ మెజార్టీ ఎంపీ సీట్లను సాధించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ అభ్యర్థులను ప్రకటించడంతో పాటు ప్రచార సరళిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ప్రత్యేక ఇన్‌చార్జీలను నియమించి ఓటర్లను ఆకట్టుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామ, మండల, మున్సిపాలిటీల పరిధిలో ఓటరు నాడిని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతుండటం పోలింగ్‌కు కూడా కొంత సమయం ఉండటంతో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల పూర్తిస్థాయి పరిశీలన జరిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితు ల్లో ఓటరు ఏ వైపు ఉన్నారో తెలుసుకునేందుకు సన్నద్ధం కావడంతో ఏజెన్సీల ద్వారా వివరాలను సేకరిస్తున్నారు.

• వివరాలు సేకరిస్తున్న బృందాలు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొన్నిరోజులుగా కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలకు చెందిన బృందాలు పర్యటిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో పర్యటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివరాలను సేకరిస్తున్నాయి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ముఖ్యంగా ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతున్నారో వివరాలు తెలుసుకునే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర పథకాల పనులతో పాటు ప్రధానంగా ఓటర్లు ఏమి కోరుకుంటున్నారో ఆరా తీస్తున్నారు. ఎక్కువ మంది ఏవైపు ఉన్నారో వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. ఈ ప్రభుత్వాలు చేస్తున్న పనుల ఆధారంగా వివరాలను తీసుకుంటున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటు ఇతర పనుల ఆధారంగా ఓటర్లు ఏ వైపు ఉంటున్నారో నాడిని పట్టుకునే విధంగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు ఎంతవరకు పనిచేస్తుంది.. ఈ ఎన్నికల్లో నిజాంషుగర్ ఫ్యాక్టరీ, ఇతర సమస్యలు అభ్యర్థులకు అనుకూలంగా ఉన్నాయా.. వంటి వివరాలను తీసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన పనులతో పాటు ఆ పార్టీ అభ్యర్థికి ఎంత బలం ఉంది ఎంత మంది ఓటర్లు మొగ్గు చూపుతున్నారో ఆరా తీస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌లో ఎక్కువ మంది మహిళలు ఉండటం వల్ల వారిపై ఫోకస్ పెట్టి వివరాలను తీసుకుంటున్నారు. వ్యవసాయ కార్మికులు, బీడీ కార్మికులు, మహిళా గ్రూపుల సభ్యులు, రైతుల నుంచి ఎక్కువగా వివరాలను తీసుకుంటున్నారు. రైతు కుటుంబాలు, గల్ఫ్ కుటుంబాల సభ్యులు ఏవైపు మొగ్గు చూపుతున్నారో వివరాలు తీసుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. గ్రామాలు, మండలాల్లో వివిధ సంస్థల ఏజెన్సీల పేర్లు చెప్పి వీరు ఈ వివరాలను తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ప్రాథమిక నివేదికలను వారి ఏజెన్సీ కేంద్రాలకు పంపిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు పార్టీ నేతలకు ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంతో పాటు ఆయా ప్రాంతాలపై ఎక్కువగా కేంద్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులే కాకుండా కొన్ని సంఘాల నేతలను మొహరిస్తూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రచారం చేసే విధంగా చూస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కువ సార్లు పర్యటిస్తూ ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీకి కీలకం కాగా బీఆర్ఎస్ నేతలు కూడా వివిధ ఏజెన్సీల ద్వారా వివరాలను సేకరిస్తూ పోటీని ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులంతా గెలుపే లక్ష్యంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. సర్వే బృందాలతోపాటు నిఘాఏజెన్సీలు గ్రామాల్లో పర్యటిస్తూ వివరాల ను సేకరిస్తున్నా ఓట ర్లు మాత్రం పూర్తిస్థాయిలో బయటపడటం లేదు.



• లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
• గ్రామీణ ప్రాంతాల నుంచే జోరుగా హద్దులు దాటుతున్న పచ్చి ధాన్యం
• సిండికేట్‌గా మారి రైతులకు మోసం చేస్తున్న వ్యాపారులు

ఆగని దళారుల ఆగడాలు!

ఎడపల్లి, ఏప్రిల్ 11: జిల్లాలో నెలరోజుల ముందే చేతికొచ్చిన ధాన్యాన్ని అదును చూసి కొందరు దళారులు సిండికేట్‌గా మారి భారీ మోసానికి పాల్పడుతున్నారు. పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ నిండా ముంచేస్తున్నారు. మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వీరి వ్యాపారం సాఫీగా సగుతోంది.

• హద్దులు దాటుతున్న పచ్చి ధాన్యం

ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో రాష్ట్రంలోనే జిల్లాలో పండించే సన్నరకం పచ్చి ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. నల్గొండ, మిర్యాలగూడ, కోదాడ ప్రాంతాలతోపాటు ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు సుమారు వేలాదిగా లారీలలో పచ్చిధాన్యం అమ్మకాలు, కొనుగోళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులలో అమ్యామ్యాలు అప్పజెప్పి ఈ దళారులు ప్రభుత్వానికి లక్షల ఆదాయానికి గండికొడుతూ జీరో వ్యాపారం సాఫీగా కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారంపై ఏ శాఖ కూడా కన్నెత్తి చూడకపోవడంపై ఉన్న ఆంతర్యం ఏమిటో ఇప్పటికీ అంతు చిక్కడం లేదు.

• కలిసొస్తున్న ప్రకృతి వైపరీత్యాలు

ఈదురు గాలులు, అకాల వర్షం సరిగ్గా ఈ వరికోతల సమయంలో రావడం దళారులకు కలిసి దందాకు కలిసి వస్తోంది. ఇదే అదునుగా దళారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల పచ్చి ధాన్యం కొనుగోలుపై పక్కా ప్రణాళికతో అమాంతం ధరలను తగ్గించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒకవైపు సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం, తెరిచినా కఠినమైన నిబంధనలు అమలు చేయడం కారణంతో రైతులు తమ ధాన్యం పండించం కంటే విక్రయించడం పెద్ద కష్టంగా మారింది. వారికి ఎదురయ్యే సమస్యలను ఆసరాగా చేసుకుని మార్కెట్‌లో సిండికేట్‌గా మారిన ఈ దళారులు జీరో వ్యాపారంతో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు.

• భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాలంటే వ్యాపారి వివిధ ఆరు శాఖల అనుమతులతో కూడిన లైసెన్సులను పొంది ఉండాలి. కానీ ఇవేవీ లేకుండా జిల్లాలోని బోధన్ డివిజన్‌లో పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ దళారుల ముఠా లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోంది. రెవెన్యూ, పంచాయితీ, రోడ్డు రవాణా, మార్కెటింగ్, వ్యాపార వాణిజ్య పన్నులశాఖ, ఆదాయ పన్నుల శాఖలతోపాటు పలు శాఖల అనుమతులతో కూడిన లైసెన్సు పొంది ఈ వ్యాపారం చేయాల్సి ఉండగా అవన్నీ పట్టించుకోకుండా కొంతమంది నాయకుల సహకారంతో దందా సాఫీగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

• ఫిర్యాదులపై స్పందన కరువు

ధాన్యానికి గిట్టుబాటు ధర దళారి నిర్ణయించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న భూస్వాములు, పెద్ద రైతుల పచ్చి ధాన్యానికి ఒక ధర చిన్న, సన్నకారు రైతుల ధాన్యానికి మరో ధర నిర్ణయిస్తున్నారు. దీనిపై వివిధ శాఖల అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా ఆట్టి శాఖల అధికారులు పట్టించకోకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇది ఇలా ఉంటే దళారీ కొనుగోలు చేసిన రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వడంలో కూడా అవలంబిస్తున్న పక్షపాత వైఖరి చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తోంది.

• అన్నీ తానై దళారుల వ్యాపారం

బోధన్ నియోజకవర్గంలో కొంతమంది దళారులు ధాన్యం వ్యాపారంలో జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. ధాన్యం దిగుబడి అధికంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేసుకుని రైతుల సమస్యలను ఆసరాగా చేసుకుని రైతులకు ముందస్తుగా పెట్టుబడి సాయం పేరుతో వడ్డీలకు డబ్బులు చెల్లిస్తున్నారు. దళారులు బినామీ పేరుతోనే రసాయన ఎరువుల దుకాణాలు తెరచి వరినాటు మొదలు కొని పిచికారీ చేయడానికి రసాయన మందులు, వరి కోతలకు నూర్పిడి యంత్రాలను సమకూర్చడం అనంతరం పండించిన పచ్చి ధాన్యాన్ని తామే కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి సాయం ఖర్చులను వడ్డీతో వసూలు చేస్తూ అన్నీ పోను మిగిలిన చిల్లర రైతుకు ఇచ్చి చేతులుదులుపుకుంటున్నారు.

నిండా మునుగుతున్నాం..

• ప్రవీణ్ కుమార్, ఎడపల్లి రైతు



దళారులు సిండికేట్‌గా మారి పెద్ద రైతు కు ఒక ధర చిన్న, సన్నకారు రైతులకు ఒక ధర చెల్లిస్తున్నారు. దళారుల వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టి రైతులు మోసపోకుండా చూడాలని చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నారు.

దళారులపై నిఘా పెట్టాం..

• అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో, బోధన్

దళారులపై నిఘాను పె ట్టాం. ఏ మండలంలో ఎం తమంది ఉన్నారు.. వారి కొనుగోలు సామర్థ్యం, వ్యాపార లావాదేవీల అన్ని విషయాలపై సమగ్ర నివేదిక తయారు చేస్తున్నాం. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పంటను అమ్ముకోవాలని సూచనలిస్తూనే ఉన్నాం.

రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు

- ధాన్యం కొనుగోళ్లను ఇప్పటి వరకు చేపట్టలేదు
- ఇచ్చిన హామీ ప్రకారం బోనస్ ఇవ్వడం లేదు
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపణ

నిజామాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. గురువారం రాత్రి ఆయన నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం కొనకపోవడం వల్ల రైతులకు మద్దతు ధర రావడం లేదన్నారు. గ్రామాల్లో రైతులు వరి కోసి కుప్పలను రోడ్లపైనే ఉంచారన్నారు. కొనుగోలు వేగవంతం చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో వరికోతలు ప్రారంభమై ఇరవై రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారన్నారు. వ్యాపారులు, దళారులు క్వింటాలు రూ.1800లకే కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదని వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోవడంతోపాటు ఇప్పటికీ రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇండోర్ స్టేడియానికి రూ.లక్ష విరాళం

ముప్కాల్, ఏప్రిల్ 11 : ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం కోసం తనవంతు సహాయంగా గురువారం రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య యువజన సంఘం సభ్యులు సంతోష్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో జాతీయ క్రీడాకారుడు కె.గంగాధర్, పీడీ రాజ్‌కుమార్, గంగారెడ్డి, దినేష్, ప్రవీన్, నవీన్, హరిష్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- డీసీవో శ్రీనివాస్‌రావు

మోర్తాడ్, ఏప్రిల్ 11: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీవో శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో పది సొసైటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కంట వేసేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్యదర్శులకు సూచించారు. రైస్‌మిల్లులో ట్రక్కు సీట్లను వెంట తీసుకువచ్చి ఓపీఎం ఎస్‌లో త్వరితగతిన ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ మోర్తాడ్ క్లస్టర్ అధికారి ఎం.శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి నర్సింగ్‌రావు, వివిధ సొసైటీల కార్యదర్శులు, సొసైటీ సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్‌రావు

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు


మహాత్మజ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్,ఏప్రిల్ 11: భారతదేశంలో బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పూలే విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గందమాల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు అనేక సామాజిక ఉద్యమాలను నడిపి బడుగు బలహీన వర్గాల కుల కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. దేశంలో మహిళలకు చదువు నిరాకరిస్తున్న ఆనాడు మొట్టమొదటి పాఠశాలలను ఏర్పాటు చేసి మహిళలకు విద్యను అందించారని గుర్తు చేశారు. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించి మహిళలు విద్యావంతులు కావాలని ఆకాంక్షించారని అన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంతోష్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు శివ మాదిగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో...

మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి సందర్భంగా టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో నగరంలోని వినాయక్‌నగర్‌లోగల జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ఛైర్మన్ టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి జరిగినప్పుడే ఈప్రజాస్వామ్య రాజ్యంలో స్వేచ్ఛ సమానత్వ సౌభ్రాతృత్వం పెంపొందించబడుతాయని అన్నారు.ఈకార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, కేంద్రబాధ్యులు పోల శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు దినేష్‌బాబు, ఉమాకిరణ్, ప్రమోద్ పాల్గొన్నారు.

మోపాల్:మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా గురువారం మోపాల్ మండలం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రచ్చ ఆనంద్, కార్యవర్గ సభ్యులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను మరువలేనివని కొనియాడారు. ఆయన చూపిన అడుగు జాడల్లో మనమందరం నడుచుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మోపాల్ మండల పద్మశాలీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో గురువారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే, సావిత్రిబాయిబాపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. సాంఘిక దురాచారాలపై జ్యోతిబాపూలే పోరాడాలని, స్త్రీవిద్య కోసం ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. సావిత్రిబాయి జ్యోతి బాపూలేసైతం భర్త అడుగు జాడల్లో నడుస్తూ బహుజన వాడలకు వెళ్లి స్త్రీలను విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు మిర్జాపూర్ చిన్న సాయన్న, ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ సర్పంచ్ పత్తిలక్ష్మణ్, విండో అధ్యక్షులు కూచిసిద్దు, నాయకులు బర్ల మధు, శ్రీనివాస్, కప్పగణేష్, హాగిర్‌రావు పటేల్ పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం బీజేపీ పార్టీ కార్యాలయంలో రుద్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రుద్రూరు మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే నిరుపేదలైనటువంటి ప్రజలందరూ విద్యావంతులు కావాలని సంకల్పంతో పేద ప్రజలందరినీ విద్యా వైపు మళ్ళించిన మహా ఘనుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కుమ్మరి గణేష్, విజయ్, శంకర్, సాయబ్రావు, నితిన్, మహేందర్, వెంకటేష్, రుద్రూరు మండల బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని గురువారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు ఆశాదీపమై అక్షర జ్యోతిని వెలిగించిన మహోన్నత వ్యక్తి జ్యోతిభాపూలే అని కొనియాడారు. భావిభారత నిర్మాణం కోసం కలలు కన్న పూలే ఆదర్శమూర్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నందన్, సాయి, సమీర్, కృష్ణ, బాల్‌రాజ్ భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సమాజంలో అణగారిన వర్గాల వారి సంక్షేమం కోసం, స్త్రీల ఉద్ధరణ కోసం మహాత్మ జ్యోతిబా పూలే ఎంతో కృషి చేశారని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు ఇల్తెపు శంకర్, మాజీ రైలు సమన్వయ సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్ అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కొనియాడారు. మహిళ ఉద్ధరణ కోసం కృషి బాలిక విద్యను ప్రోత్సహించారన్నారు. అణగారిన కులాల ప్రజలకు సమాన హక్కులు అందించడానికి ఆయన సత్యశోధక్ స్థాపించారని సమసమాజ స్థాపనకు ఆయన చేసి కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్ధన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, గ్రామ పెద్దలు కేజీ గంగారాం, గాండ్ల రాజేశ్వర్, అల్లె రమేష్, బుయ్యన్ సురేష్, స్వామిగౌడ్, సింగడి పాండు, కన్నె లక్ష్మణ్‌లతో తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గౌడ్స్ కాలనీలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల వారి కోసం మహాత్మ జ్యోతిబా పూలే ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే 198జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంబ్లే విఠల్, మల్లికార్జున్, వ్యాపారే గంగాదర్, ప్రసాద్, ప్రకాష్, కృష్ణ, విజయ్, రామాగౌడ్ పాల్గొన్నారు.

ముప్కాల్: బడుగు బలహీనవర్గాల చదువుకోవడానికి పాఠశాలలను స్థాపించిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగిస్తూ ఆయన అడుగు జాడల్లో నడవాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాల్య వివాహాలు, వితంతు వివాహాలు ప్రోత్సహించవద్దని, అణగారిన వర్గాల కోసం పాఠశాలను ఏర్పాటు నెలకొల్పి విద్యను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనికేష్ రఘు, పుట్ట రాజేశ్వర్, భూమేశ్వర్; ఆనంద్, నరేష్, రాంరాజ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: వేల్పూర్ మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలను నిర్వహించారు. వేడుకలకు మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు మాహాత్మజ్యోతిబాపూలే అన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహాత్మలోకోద్ధారణకు ఎంతో పాటుపడ్డాడన్నారు. అణగారిన ప్రజలకు సమాన హక్కులు అందించేందుకు సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేశారని కొనియాడారు. ఇప్పుడు ప్రభుత్వాలు, పార్టీలు మహాత్మ జ్యోతిరావుపూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడెటి శంకర్, కోశాధికారి సుకేష్, మాజీఅధ్యక్షుడు చిల్కకిష్టయ్య, బేతు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

● పలు సంఘాల ఆధ్వర్యంలో..

పట్టణంలోని అంబేద్కరచౌరస్తాలో పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం మహాత్మజ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజా, వామపక్ష, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహాత్మజ్యోతిబా పూలే అట్టడుగు వర్గాల ప్రజల విద్యవ్యాప్తికై 42స్కూళ్ళను ప్రారంభించి విద్యను అందజేశారని, సమాజంలో సామాజిక రుగ్మతలపై నిరంతరం పోరును సాగించారని, సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి సమాజంలో పెరుకుపోయిన అసమానతలపై తిరుగుబాటు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో సమసమాజ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ మూగ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శెట్‌పల్లి నారాయణ, అంగిరి ప్రదీప్, కుతాడి ఎల్లయ్య, ఎం.రాజన్న, అర్గుల్ సురేష్, జంగం అశోక్, ఎల్‌టి. కుమారస్వామి, సుంకే శ్రీనివాస్, తెడ్డు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని గురువారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు ఆశాదీపమై అక్షరజ్యోతిని వెలిగించిన మహోన్నత వ్యక్తి జ్యోతిబాపూలే అని కొనియాడారు. భావిభారత నిర్మాణం కోసం కలలు కన్న పూలే ఆదర్శమూర్తి అని ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నందన్, సాయి, సమీర్, కృష్ణ, బాల్‌రాజ్ భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ లీగల్:నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతి బాపూలే సమాజంలోని అంటరానితనాన్ని స్త్రీల పట్ల వివక్షత గమనించి దానిని నిరోధించడానికి తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యను నేర్పించాడని అన్నారు. పూణేలో మొట్టమొదటిసారిగా బాలికల కోసం ప్రత్యేకమైన పాఠశాలను ఏర్పాటు చేయడంతో విద్యకు శ్రీకారం చుట్టిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దీపక్, న్యాయవాదులు కేశవ్, పులిజై పాల్, శివాజీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో..



టీయూలో ..


పూలేకు నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవోస్ సభ్యులు


ముప్కాల్‌లో..


సాలూరలో..



నివాళులర్పిస్తున్న టీఎస్‌యుటీఎఫ్ నాయకులు



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు


రుద్రూరులో..


మోర్తాడ్‌లో..


కోటగిరిలో..

ఎంపీగా మరోసారి అర్వింద్ గెలుపుఖాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్11: పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ గెలుపొందడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని అర్గుల్, మునిపల్లి గ్రామాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు మళ్లీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జైడి గంగారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్గుల్‌లో జ్యోతిబా పూలే జయంతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్11: మండలంలోని అర్గుల్ గ్రామంలో గురువారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మజ్యోతి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిలాల్లా మాజీసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గోర్త రాజేందర్, ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహేష్, సందీప్, రమేష్, శీను, అనుష్, అఖిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలోని జాతీయరహదారి పక్కన గల జ్యోతిబా పూలే విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. గురువారం జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లారి రాజారాం, కిషన్, దశరథ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్11: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండగను ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్ద ముస్లీం సోదరులు ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లీం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జక్రాన్‌పల్లి,అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి,తొర్లికొండ, మునిపల్లిల, లక్ష్మాపూర్, కొలిప్యాక్, కలిగోట్, పడకల్, కేశ్‌పల్లి, సికింద్రాపూర్ గ్రామాలలో ముస్లీం సోదరు లకు వివిధ పార్టీ నాయకులు రంజాన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఈద్గాల వద్ద వివిధపార్టీల నాయకులు ముస్లీంలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కోస్లి అలీసాగర్ కాలువలో మహిళ మృతదేహం లభ్యం

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ, ఎస్ఐలు ● మృతురాలు బోర్గాంకు చెందిన చంద్రకళగా గుర్తింపు

నవీపేట,ఏప్రిల్11: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్ నగర్ తండా సమీపంలో ఉన్న అలీసాగర్ ప్రధాన కాలువలో గురువారం మహిళ మృతదేహం లభ్యమైందని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్ తెలిపారు. మృతురాలు రెంజల్ మండలం బోర్గాంకు చెందిన పెంటేవార్ చంద్రకళ(46)గా గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉపాధి హామీ పనికి వెళ్లిన చంద్రకళ మధ్యాహ్నం ఇంటికి వచ్చిందని అనంతరం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదని సీఐ పేర్కొన్నారు. మృతురాలి కుమార్తె సంగీత తన తల్లికి ఫోన్ చేయగా బయట ఉన్నానని కొద్దిసేపు ఆగి ఇంటికి వస్తానని పేర్కొనట్లు సీఐ తెలిపారు. సాయంత్రం సమయంలో తిరిగి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందని అన్నారు. గురువారం కోస్లీ పంచాయతీ పరిధిలోని భరత్‌నగర్ తండా సమీపంలో ఉన్న అలీసాగర్ ప్రధాన కాలువలో చంద్రకళ మృతదేహం లభ్యమైందని ఆమె తల వెనుక భాగంలో గాయం ఉందని సీఐ పేర్కొన్నారు. ప్రస్తుతం అలీసాగర్ కాలువలో నీటి ప్రవాహం లేనప్పటికీ కొద్దిపాటి నీరు నిలిచి ఉండగా అందులో ఆమె మృతదేహం లభ్యమైందని సీఐ వివరించారు. చంద్రకళ తలకు గాయం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను కొట్టి చంపి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసినట్లు ఆయన వివరించారు. మృతురాలికి భర్త మారుతి, కుమార్తె సంగీత ఉన్నారని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీపేట ఎస్ఐ యాదగిరి గౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


కోస్లీ అలీసాగర్ కాలువలో మహిళ మృతదేహం లభ్యం

'రైతులను మోసం చేసిన విత్తన కంపెనీలపై చర్యలు తప్పవు'

● రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి


కోటగిరిలో సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్11: రాష్ట్రంలోని రైతులను విత్తనాల పేరుతో మోసం చేసిన కంపెనీలపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం మైనారిటీ సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షహీద్ తన స్వగృహంలో సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఇటీవల కోటగిరి మండల కేంద్రంలో రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అందించిన కంపెనీపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులు పొద్దు తిరుగుడు పంటను దళారులకు అమ్మి మోసపోద్దని సూచించారు. పొద్దు తిరుగుడు పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షహీద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత

మెండోర, ఏప్రిల్11: ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమాయోజన పథకం కింద అర్హులైన బాధిత కుటుంబసభ్యులకు ప్రమాదబీమా చెక్కులను బుస్సాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రిజినల్ మేనేజర్ రామారావు బాధిత కుటుంబసభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బోజేందర్, రాజన్న, ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందడంతో మృతులు గతంలో బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.436చెల్లించి ఈ పథకంలో నామిని ఉన్న వారి కుటుంబసభ్యులకు రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌మేనేజర్ రాజేశ్వర్‌గౌడ్, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెగ్డోలిలో కుస్తీపోటీలు


హెగ్డోలిలో తలపడుతున్న కుస్తీవీరులు

కోటగిరి,ఏప్రిల్11: పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఉగాది అయిన రెండు రోజుల తర్వాత గ్రామంలో కుస్తీపోటీలను నిర్వహించడం ఆనవాయితీ. కుస్తీపోటీలను గ్రామ వతన్‌దార్ ఉమాకాంత్ దేశాయ్ ప్రారంభించారు. పలు గ్రామాల నుండి కుస్తీవీరులు తరలివచ్చి పోటీలలో పాల్గొని తమ సత్తాను చాటారు. గెలుపొందిన కుస్తీవీరులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హెగ్డోలి శంకర్, రాంబాబు, వెంకాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరిన టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 11: టీఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఉద్యమకారుడు కమ్మర్‌పల్లికి చెందిన చింత శ్రీకుమార్ గురువారం ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మెట్‌పల్లి వెలుతు కమ్మర్‌పల్లిలో కొద్దిసేపు ఆగారు ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ అధ్వర్యంలో చింత శ్రీకుమార్‌తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరగా వారికి పార్టీ ఖండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అసెంబ్లి కన్వీనర్ మల్కన్న గారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రేంజర్ల గంగారాం, మండలపార్టీ అధ్యక్షుడు కట్ట సంజీవ్, కార్యకర్తలు చింత ప్రవీన్, రెంజర్ల గంగాధర్, కొత్తపల్లి అరుణ్, బాస్కర్, హరీష్, సుభాష్, సంతోష్‌అన్నం గణపతిరాం,బీజేపీ నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఏప్రిల్ 11: మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం మాజీ విప్ రాష్ట్ర ఖనిజ వనరుల శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఏర్గట్ల బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, జోగు చిన్నయ్య, జుంగల సర్పంచ్, ఎట్టెం అరుణ్ యాదవ్, పోశెట్టి, బిగ్ బాస్‌లకు ఈరవత్రి అనిల్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లెరాజేశ్వర్, సున్నపు అంజయ్య, రొక్కెండ సంజీవ్, రెండ్ల రమేష్‌లు పాల్గొన్నారు.

నవీపేటలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,ఏప్రిల్11: మండల కేంద్రంలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు గణపతి పూజ, పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ భద్ర మండల స్థాపనలు, జలాధివాసము, గణపతి హోమం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేష్, తెడ్డు పోశెట్టి, సూరి బాబు, ఒడ్డె రవి తదితరులున్నారు.

బోధన్‌లో చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్11: బోధన్ పట్టణ శివారులోని మినార్‌పల్లి ఎక్స్ రోడ్డులో కమ్మ సంఘం,కాకతీయ చేయూత చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ మాట్లాడుతూ.. వేసవిలో చలివేంద్రాలు రహదారులపై వెళ్లే వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతీ సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా కాకతీయ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వాహనదారులు, బాటసారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం ప్రతినిధులు సూరిబాబు, గాంధీ, హరిబాబు, పావులూరి వెంకటేశ్వర్ రావు, కమ్మ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం'



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఏప్రిల్ 11:దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏఐకేఎంఎస్ అలుపెరగని పోరాటం చేసిందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ తెలిపారు. గురువారం నగరంలోని నాందేవ్‌వాడలోగల తెలంగాణ రైతు సంఘం కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా కిసాన్ సభను 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న ఏఐకేఎస్ ఏర్పడి దేశ వలస పాలనకు భూస్వామ్య పీడనకు కంపెనీ వ్యవసాయానికి, వడ్డీ వ్యాపారుల దోపిడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెల్లుబికిన రైతుల పోరాటం సంఘటిత పర్చే క్రమంలో ఉత్తర ప్రదేశ్ లక్నో వేదికగా అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి రమేష్ బాబు, రైతు సంఘం సభ్యులు దేవేందర్‌సింగ్, సాయిలు, మురళీకృష్ణ, నారాయణ, లక్ష్మి, పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాములు, కటారి రాములు, విఘ్నేష్, సుజాత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్



పోతంగల్‌లో..



ఈద్గా వద్ద నవాజ్ చేస్తున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ముస్లిం సోదరులు



నగరంలోని ఈద్గా వద్ద చిన్నారులు, యువకుల సందడి



డిచ్‌పల్లిలో..



రుద్రూరులో..

జిల్లా వ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు

జిల్లా అంతటా రంజాన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈద్గాల వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు ప్రజాప్రతినిధులు, అధికారులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గాల వద్ద చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఈద్ ముబారక్‌ను తెలియజేశారు.

● నిజామాబాద్ న్యూస్ నెట్‌వర్క్



ఇందల్వాయిలో..



ఏర్గట్లలో..



ఆర్మూర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బోధన్ ఈద్గా వద్ద చిన్నారుల అలయ్ భలయ్



కమ్మర్‌పల్లిలో..



బోధన్‌లో భారీ పోలీసు బందోబస్తు



ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నవీపేటలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

● ఆరు గ్యారెంటీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 11:నీరు లేక, కరెంటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం నగరంలోని దుబ్బలో గల ఎంకే గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయక మోసం చేస్తుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నగదే ఇస్తున్నారు తప్ప హామీ ఇచ్చిన తులం బంగారం ఇప్పటికి ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. అనేక సమస్యలతో ప్రజలు బాధపడుతుంటే ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్న ఎంపీగా ఉన్న అరవింద్ జిల్లాకు చేసిందేమీలేదన్నారు. పసుపు బోర్డు పేరుతో ఎంపీగా గెలిచిన అరవింద్ మళ్లీ అదే పేరుతో గెలవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే ప్రజలు కేసీఆర్‌ను ఎందుకు గెలిపించుకోలేదని ఆలోచన చేస్తున్నారని ఈ ప్రభుత్వ తీరు చూస్తు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌ను నిలదీయాలని పసుపు బోర్డు ఇవ్వని అర్వింద్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, సిర్ప రాజు, దారం సాయిలు, సుజిత్‌సింగ్‌ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవీపేట మండలంలో తేలికపాటి వర్షం

నవీపేట,ఏప్రిల్11: మండలంలోని పలు గ్రామాలలో గురువారం తెల్లవారుజామున చిన్నపాటి వర్షం కురిసింది. ఇటీవల జరిగిన వాతావరణ మార్పులతో వాతావరణం చల్లబడగా గురువారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన చిన్నపాటి వర్షం కురియడంతో ఉష్ణోగ్రత్తలు తగ్గాయి. ఇదిలా ఉండగా గత వారం రోజుల నుండి యాసంగి పంటలకు సంబంధించి మండలంలో వరి కోతలు ప్రారంభం కాగా గురువారం తెల్లవారుజామున చిన్నపాటి వర్షం కురియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 11: ఆన్‌లైన్ మోసాలపై గ్రామీణ ప్రజలు అప్రమతత్తతో మెలగాలని ఎస్సై మహేష్ సూచించారు. గురువారం మండలంలోని మిట్టపల్లి, మిట్టపల్లి తాండా, రాంపూర్ తాండాలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా జరిగిన పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆర్యక్షత్రియ మరాఠా సమాజ్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

పెద్దబజార్, ఏప్రిల్ 11: నగరంలోని నాందేవ్‌వాడలోగల విఠలేశ్వర ఆలయంలో ఆర్యక్షత్రియ మరాఠా సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దిగంబర్‌రావు పవార్, ప్రధాన కార్యదర్శి నరేందర్ కదం, కోశాధికారిగా జ్యోతిశ్వర్ సంత్ పాలేనిలు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు దిగంబర్‌రావు పవార్ మాట్లాడుతూ మరాఠ సమాజ్‌ను 50 సంవత్సరాల క్రితం స్థాపించడం జరిగిందన్నారు.మరాఠా సమాజ్ అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రాన్ని చూపిస్తున్న బాధితురాలి కుటుంబసభ్యుడు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 11: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సగం సుజాత కిడ్నీసంబంధిత వ్యాధితో బాధపడుతూ.. మెరుగైన చికిత్స కోసంహైదరాబాద్ నిమ్స్‌ఆసుపత్రిలో చేరింది. వైద్యఖర్చుల కోసం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్ చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి రెండున్నర లక్షల రూపాయల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరీ పత్రాన్ని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుజాతకు గురువారం అందజేశారు.ఎల్‌వోసి మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డిలకు, కాంగ్రెస్ నాయకులకు బాధితురాలు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.305	రూ. 325

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,000	రూ.68,200	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)
స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)
స్క్రీన్-3 : లవ్‌గురూ (10.15, 7.15)
: మంజుమ్మల్ బాయ్స్ (1.25, 4.20)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.25)
స్క్రీన్-4 : లవ్‌గురూ (12.40)
: మైదాన్ (హిందీ) (3.45, 10.10)
: శ్రీరంగనీతులు (7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.40)
: టిల్లు స్క్వేర్ (1.30, 10.40)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)
స్క్రీన్-2 : లవ్ గురు (10.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (1.30, 7.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30)
: డియర్ (10.30)
స్క్రీన్-3 : డియర్ (10.30)
: మైదాన్ (హిందీ) (1.20, 7.20)
: మంజుమ్మల్ బాయ్స్ (4.45)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (10.45)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్